క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ ఈవోకి విరాళం అందజేస్తున్న దాత

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి విశాఖకు చెందిన కేదార్‌శెట్టి కిషోర్ విరాళం అందజేశారు. ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డికి ఆదివారం రూ.1,11,116 నగదును ఆలయ అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దాతచే అమ్మవారికి పూజ చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ మాస శుద్ధ నవమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గాన్ని ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. నేరెళ్లకోనేరులో గల 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు నివాసంలో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను వెండి కిరీటం, రుద్రాక్షలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది లోపే ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తానన్నారు. ప్రజల వద్దకే పాలన అందుతుందన్నారు. నాగరాజు మాట్లాడుతూ ఓల్డ్ సిటీని గోల్డ్ సిటీగా చేసే సత్తా వంశీకి ఉందన్నారు. కార్యక్రమంలో కందుల కేదార్‌నాథ్, బద్రీనాథ్, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకతో ఆందోళన



సీతమ్మధార: రద్దీగా ఉండే బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం ఎదురుగా గల రోడ్డులో ఆదివారం భారీ లారీ నుంచి పొక్లెయిన్‌ను ప్రమాదకరంగా కిందికి దించారు. పొక్లెయిన్‌ను దించుతుండగా లారీ ముందు భాగం ఒక్కసారిగా పైకి లేవడంతో దానిముందు ద్విచక్ర వాహనంపై ఉన్న కుటుంబ సభ్యులు ఉలిక్కిపడి భయభ్రాంతులకు గురయ్యారు. రద్దీగా ఉండే ప్రాంతంలోకి లారీలు రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి భారీ వాహనాలు రాకుండా చూడాలని కోరుతున్నారు.

అయ్యో.. అభాగ్యులు

ఒకరు తమలో తామే ఏదో మాట్లాడుకుంటూ ఉంటారు. అంతలోనే నవ్వుతుంటారు. ఏడుస్తూ సైగలు చేస్తారు. ఎవరినో శపిస్తూ.. అర్థం పర్థం లేని భాష మాట్లాడుతుంటారు. మరొకరు మాటా పలుకూ లేకుండా రోడ్డు పక్క రాయిలా పడి ఉంటారు. కొందరు జనం మీద దాడులు చేస్తారు. వీరంతా దీనులు.. దురదృష్టవంతులు. ఎక్కడ పడితే అక్కడ కనిపించే వీరంతా మనసు చెదిరిన అభాగ్యులు. సమాజంతో బంధం తెగిపోయి.. తెగిన గాలిపటాల్లా గాలివాటున కొట్టుకుపోయే సమాజం విసిరేసిన దీనులు. గాలికి ఎగిరే కాగితం ముక్కలా ఎక్కడో మొదలై.. మరెక్కడో కథ ముగిసిపోయే నిర్భాగ్యులు.

- అయిన వాళ్లకు దూరంగా రోడ్డు పక్క బతుకుతున్న దురదృష్టవంతులు
- పిచ్చివాళ్లు అనే కారణంగా కరుణ చూపని సమాజం



స్టేషన్ రోడ్డులో ఇలా దీనంగా..



జ్ఞానాపురం రైల్వేస్టేషన్ వద్ద అభాగ్యుడు

దాబాగార్డెన్స్: ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో తెలియదు. ఇక్కడికి ఎలా వచ్చారో అంతకన్నా తెలియదు. ఇక్కడ ఎన్నాళ్లుంటారో.. మళ్లీ ఎక్కడికి వెళ్తారో.. అసలు ఎక్కడికైనా వెళ్తారో లేదో కూడా అర్థం కాదు.. సమాజం అంటే పట్టని ఈ నిర్భాగ్యుల జీవితమనే పుస్తకంలో పేజీలు తారుమారై.. అక్షరాలు చెల్లాచెదురై.. మనసు ఆనవాళ్లు మాయమైపోయిన అభాగ్యులు.. వారే ఎక్కడ పడితే అక్కడ తారస పడే పిచ్చివాళ్లు. దేనిపైనా ధ్యాస లేక..తమకేమవుతుందో తెలియక.. ఇది తమ తనువనే స్పృహ కూడా కాన రాక వింతగా, విభిన్నంగా ప్రవర్తిస్తూ సమాజానికి దూరమైపోయిన దీనులు వీళ్లు.

ఎక్కడైనా కనిపిస్తారు..

ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వాళ్లు నగరంలో అనేక చోట్ల కనిపిస్తారు. బస్టాపులు, రైల్వేస్టేషన్ పరిసరాలు, మారుమూల ప్రాంతాలు, ఫుట్‌పాత్‌లు.. ఎక్కడైనా వీళ్లు కనిపిస్తారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి విశాఖకు వచ్చే రైళ్లలో పిచ్చివాళ్లు వస్తున్నారు. నగరంలోని రైల్వేస్టేషన్, జ్ఞానాపురం, అక్కయ్యపాలెం, డాబాగార్డెన్స్, పెదవాల్తేర్, చినవాల్తేర్, పాతనగరం, కేజీహెచ్, రామకృష్ణా బీచ్ తదితర ప్రాంతాల్లో వీళ్లు ఎక్కువగా కనిపిస్తారు. చివరికి ఎక్కడో బతుకు పయనం ముగిస్తారు. అనాథ మృతదేహంగా ఇక్కడి మట్టిలో కలిసిపోతారు. బిచ్చగాళ్లలా యాచించడం కూడా తెలియక ఎవరైనా జాలిపడి ఏదైనా ఇస్తే తిని, లేదంటే అలా గాలికెగిరే ఎండుటాకులా ఊరంతా సంచరిస్తూ ఉంటారు. సమాజంలో ఉన్న అనేక అపోహలు, తప్పుడు అభిప్రాయాల కారణంగా వీరికి సాయం చేయడానికి కూడా ఎవరూ ముందుకు రారు. అసలు వీరి గురించి పట్టించుకోవడానికి కూడా ఎవరూ ఇష్టపడరు. నగరంలోని పలువురు దాతలు తరచూ ఫుట్‌పాత్‌లు, బస్టాపుల్లో గల పిచ్చివాళ్లకు భోజనాలు అందజేస్తూ తమ దాతృత్వం చాటుకుంటున్నారు. కాని, ఆస్పత్రికి తరలించే విషయంలో మాత్రం అంతటా నిర్లక్ష్యం కనిపిస్తోంది.

ఇక్కడికే ఎందుకు?

సాధారణంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజలు తమ ఇంట్లో ఎవరికైనా పిచ్చి పడితే విశాఖపట్నం వెళ్లే రైళ్లలో బలవంతంగా ఎక్కించేస్తుంటారన్న అపప్రథ ఉంది. విశాఖలో ప్రభుత్వ మానసిక ఆస్పత్రి ఉండడమే దీనికి కారణంగా చెప్పుకుంటారు. ప్రజలో, పోలీసులో వీరిని ఆస్పత్రిలో చేర్పిస్తారులే అన్న నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తుంది. ఎవరికైనా పిచ్చి పడితే వారిని వదిలించుకుందామని కుటుంబ సభ్యులే చూడటం అంతరించిపోతున్న మానవత్వానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు.

ఇలా చేస్తే మేలు..

నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపైనా, బస్టాపుల్లోనూ, ఫుట్‌పాత్‌లపైనా చాలా మంది నా అన్న వాళ్లకు దూరంగా బతుకుతున్నారు. అందరూ వీరిని చూసి అయ్యో అనుకోవడం తప్ప ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. ఇటీవల అపోహల కారణంగా వీరి మీద జనం దాడులు చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మానసిక ఆస్పత్రి ఆధ్వర్యంలో ఒక సంచార వాహనం ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పిచ్చివాళ్లను ఆస్పత్రికి తరలించాలి. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం కూడా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు పక్క చెత్తకుప్పల దగ్గర..



దాతలు దయతలిస్తేనే ఆ పూట సాపాటు

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



ప్రతిభా భారతిని సత్కరిస్తున్న అధికారులు



అలీ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖలో పని చేసిన టైపిస్ట్ జి. ప్రతిభా భారతి సేవలు ప్రశంసనీయమని ఆ శాఖ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ అన్నారు. 28 సంవత్సరాల పాటు సేవలందించి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మణిరామ్ మాట్లాడుతూ ప్రతిభా భారతి ఎన్నో ముఖ్య సంఘటనల్లో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలందిస్తూ మంచి పనితీరు కనబరిచారని అన్నారు. అనంతరం ఆమెను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

డ్రైవర్ అలీకి సత్కారం

విశాఖ సమాచార పౌర సంబంధాల కార్యాలయం, ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజినీరింగ్ కార్యాలయం పరిధిలో సుదీర్ఘ కాలం పని చేసి అనకాపల్లి బదిలీపై వెళ్లిపోయిన డ్రైవర్ ఎస్.కె. అలీ ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయనను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సత్కరించారు. ఆయన సేవలను అధికారులు కొనియాడారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మాచవరపు యామిని, ఇతర వైద్య శిబ్బంది పాల్గొని 186 మందికి బీపీ, సుగర్, కంటి, ఈసీజీ మొదలగు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యామిని మాట్లాడుతూ నిరంతర వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంచి పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. మంచినీటి ద్వారా సగం వ్యాధులు నయమవుతాయని వివరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ప్రసాదరావు, జాలీవాకర్ ఎస్.ప్రకాశరావు, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, సత్తి సునీల్‌రెడ్డి, కె.ద్వారకానాథ్, కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, వి.అప్పారావు, ఎస్.రామమోహన్ శిబిరం నిర్వహణకు సహకరించారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

సింహాచలం: సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సింహాచలేశుడిని దర్శించుకోవడానికి బారులు తీరారు. దీంతో గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగల తో అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతి అందజేశారు.

కాశీరాజుకు నివాళి

మహారాణిపేట: చోడిపల్లి కాశీరాజు శేష జీవితం ఆధ్యాత్మికమయం అని శ్రీ సుందర చైతన్య ఆశ్రమ ప్రతినిధి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం హార్బర్ సమీపంలో జరిగిన సంతాప సభలో ఆయన పాల్గొని కాశీరాజుకు నివాళులు అర్పించారు. సెంట్రల్ టెలిగ్రాఫ్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసి రిటైర్ అయిన తర్వాత కాశీరాజు సుందర చైతన్య ఆశ్రమంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. ఇటీవల ఆయన చనిపోయారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కాశీరాజు భగవద్గీత, భారతం, భాగవతం, రామాయణం వంటి గ్రంథాలు పఠిస్తూ శేషజీవితం గడిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు ఎం.వెంకటరావు, కె.రామకృష్ణ, ఎస్.గోపాలకృష్ణ, బి.భాస్కరరావు, బి.సాంబమూర్తి, ఎస్ఎస్ఆర్‌సీహెచ్‌ఎం శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



కాశీరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆశ్రమవాసులు

నాటక రంగానికి చేయూతనివ్వండి

- కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్. రాజు



ప్రేక్షకులను అలరించిన భక్త ప్రహ్లాద నాటకంలోని అద్భుత సన్నివేశం



ప్రేక్షకులతో కిక్కిరిసిపోయిన ఆడిటోరియం

మద్దిలపాలెం : ప్రతి ఒక్కరూ పౌరాణిక నాటకాలకు చేయూత ఇవ్వాలని కళాభారతి అధ్యక్షుడు, ఎస్ఆర్‌కే ఇన్ఫ్రా ప్రాజెక్ట్ చైర్మన్ ఎం.ఎస్.ఎన్. రాజు ఆకాంక్షించారు. శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి, హైదరాబాద్) 140వ వార్షికోత్సవం సందర్భంగా కళాభారతి పద్మశ్రీ సురభి బాబ్జి కళా ప్రాంగణంలో భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. రంగశాయి నాటక సంఘం ఆవిష్కర్త బాదంగీర్ సాయి, కళాభారతి యాజమాన్యం సహకారంతో రంగసాయి మీడియా ఏర్పాటు చేసిన రెండవ రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రేపటి తరానికి మన సంస్కృతిని అందివ్వాలన్నారు. బాదంగీర్ సాయి అందిస్తున్న కళాదీప్తిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ కళా ప్రోత్సాహకులే రాజపోషకులుగా నాటక రంగం మనుగడ సాగించాలని ఆశించారు. ప్రత్యేక అతిథులుగా కళాభారతి కార్యదర్శి రాంబాబు, ట్రస్టీలు మల్లికా మనోజ్, రామ్‌గోపాల్, ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ అధికారులు నాగరాజారావు, ఎంవీ సుబ్రహ్మణ్యం, సినీ దర్శకులు అకిరి సురేష్, రంగస్థల నటులు వడ్రే నాంచారయ్య, సినీ రచయిత రవి బ్రహ్మ, రిటైర్డ్ ఏడీజే డాక్టర్ పీజే సుధాకర్, నటుడు, నిర్మాత డాక్టర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన..

శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి) సంస్థ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం నాటక ప్రియులను ఆద్యంతం అలరించింది. ప్రదర్శనకు ఆడిటోరియం నిండిపోవటం చూస్తే నాటకాలకు ఆదరణ లేదనే మాట సరికాదని అర్థమవుతోంది. చక్కటి లైటింగ్, టెక్నిక్, కళాకారుల నటనా చాతుర్యంతో నాటక ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది.

కిడ్స్ ఫ్యాషన్ షో అదుర్స్

మద్దిలపాలెం: క్వీన్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జూనియర్ మోడల్ సీజన్-4 మెగా ఫైనల్ ఘనంగా జరిగింది. మద్దిలపాలెం దగ్గరలోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్వీన్ ఈవెంట్స్ నిర్వాహకురాలు ఉషా రాణి ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఆడిషన్లు నిర్వహించగా.. 100 మంది పిల్లలు హాజరయ్యారని, వారిలో 30 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించామన్నారు. ముఖ్య అతిథి మిసెస్ ఇండియా పుష్ప లోకేష్, మిసెస్ కర్నాటక చందన మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న జిజ్ఞాసను వెలికి తీసి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్యాటగిరీకి సంబంధించి మూడు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాక్ రౌండ్, టాలెంట్ షో ఎంతగానో ఆకట్టుకున్నాయి. జూనియర్ మోడళ్లు తమ ఫ్యాషన్ వాక్‌తో అలరించారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా మిసెస్ విశాఖ రన్నర్ కరుణ, బ్రైడ్స్ ఆఫ్ ఇండియా మిస్ జాహ్నవి, మిస్ గాడిజియస్ విన్నర్ నిహారిక, మిసెస్ ఆంధ్రప్రదేశ్ బేబీ రాణి, స్టార్ మహిళా విన్నర్ నవీన వ్యవహరించారు.



సీజన్-4 మెగా ఫైనల్‌లో ఫ్యాషన్ వాక్‌తో అలరిస్తున్న జూనియర్ మోడల్

అభివృద్ధికి ఆమడ దూరం



అభివృద్ధికి నోచుకోని కల్యాణ మండపం

- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లున్న పాతనగరం
- కళావిహీనంగా పార్కులు.. కాంతిహీనమైన కల్యాణ మండపాలు
- ఇప్పటికైనా పట్టించుకోవాలని స్థానికుల వినతి

జగదాంబ: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పాతనగరాన్ని అభివృద్ధి చేయాలని జీవీఎంసీ 39వ వార్డు ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధిలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయిందని వాపోతున్నారు. పోర్టుకు వచ్చే పర్యాటకులు, మదీనా బాబా దర్గాకు వచ్చే భక్తులు, పోర్టు సోయగాలు, సముద్ర అందాలు, షిప్‌యార్డు, కొండ గుడి వీక్షణకు వచ్చే టూరిస్టులు ఎంతో మంది ఉన్నప్పటికీ పాతనగరం అభివృద్ధిలో వెనుకబడే ఉందంటున్నారు స్థానికులు. నాటి గుర్తులుగా రాణి విక్టోరియా విగ్రహం, మున్సిపల్ స్టేడియం, క్వీన్‌మేరీ పాఠశాల, బ్రిటీష్ కట్టడాలు ఉన్న ఈ ప్రాంతం నిజానికి టూరిస్టు కేంద్రంగా అభివృద్ధి జరగాలని చెబున్నారు. అయితే అటువంటి ప్రయత్నాలు ఎక్కడా జరగకపోవటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళావిహీనంగా పార్కులు, కల్యాణమండపం..

పాతనగరంలోని లక్ష్మీ టాకీస్ వద్ద పెద్ద పార్కు ఉంది. కానీ అందులో ఒక్క మొక్క గానీ, కూర్చోవడానికి కుర్చీలు గానీ లేవు. ఆహ్లాదం పంచే ఏర్పాట్లు ఏవీ లేవని స్థానికులు పేర్కొంటున్నారు. నగరంలో అన్ని వార్డుల్లో ఎక్కడో ఒక దగ్గర పార్కులు ఏర్పాటు చేసి అన్ని సదుపాయలు కల్పిస్తుంటే ఇక్కడ ఉన్న పార్కును అభివృద్ధి చేయలేకపోవటం దురదృష్టకరమని చెబుతున్నారు. నగరమంతా బస్సు బేల నిర్మాణాలు జరుగుతుంటే నగరానికే మొట్టమొదటి బస్టాప్‌గా పేరు తెచ్చుకున్న పెద్ద పోస్టాఫీస్ బస్టాప్ ఎలాంటి అభివృద్ధి లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీ టాకీస్ వద్ద కళావిహీనంగా ఉన్న పార్కు

పేరుకు తగ్గట్లే ఉంది..



పాతనగరం పాతనగరంగానే ఉండిపోయింది. తర్వాత వచ్చిన ఎంవీపీ, సీతమ్మధార వంటి అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధించాయి. వన్‌టౌన్ అప్పటికీ ఇప్పటికీ ఒకేలా ఉండిపోయింది. ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చారిత్రక ప్రాధాన్యతను కాపాడాలి.

–దూద కృష్ణారావు, 39వ వార్డు

గొప్పదనం అందరికీ తెలియాలి..



విశాఖ అంటే వెనుకటి కాలంలో పాతనగరమే. అప్పట్లో ఈ ప్రాంతం కళకళలాడేది. అయితే తర్వాతి కాలంలో ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి భావితరాలకు ఈ ప్రాంతం గొప్పదనాన్ని తెలపాలి.

– మైలపల్లి రాజు, 39వ వార్డు

ఉత్సాహంగా 2-కె రన్



2కె రన్‌లో పాల్గొన్న చార్టెర్డ్ అకౌంటెంట్లు

బీచ్‌రోడ్డు : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆదివారం నగరంలోని చార్టెర్డ్ అకౌంటెంట్లు వికసిత్ భారత్ పేరుతో 2కె రన్ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ రన్‌ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ అనిర్బన్పాల్ ప్రారంభించారు. సీఏ డే సందర్భంగా ప్రధాని పిలుపు మేరకు ఈ రన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు, విద్యార్థులకు పుస్తక పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు సహకారం

తాటిచెట్లపాలెం: నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం ఫర్హాన్ రషీద్ ఫ్రీలాన్స్ రిక్రూట్‌మెంట్ సంస్థ తోడ్పాటు అందిస్తోందని సంస్థ ప్రతినిధి ఫర్హాన్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరం, రాష్ట్రం, దేశంలో అర్హులైన అభ్యర్థులకు సరైన పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు తమ సంస్థ అభ్యర్థులను సరైన విధానంలో తీర్చిదిద్దుతుందన్నారు. ప్రతి వ్యక్తికి వారి నైపుణ్యాలు, అర్హతలు, ఆకాంక్షలకు అనుగుణంగా సహకరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వివరాలను hr@farhanrasheed.com, www.farhanrasheed.com ఈ మెయిల్, వెబ్‌సైట్‌ల్లో తెలుసుకోవచ్చని, సందేహాలుంటే 99665 94448 నంబర్‌లో సంప్రదించాలని ఫర్హాన్ కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెల్ ప్రారంభం

ఎంవీపీకాలనీ : లాసన్స్ బే కాలనీలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెల్‌ను ఆదివారం ప్రారంభించారు. లయన్స్ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఎంఎం మహేష్, పూర్వ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, బీజేపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన యువతీ యువకులు, మహిళలకు కనీస విద్యార్హత కలిగిన వారికి ఉచితంగా నాలుగు నెలల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, ఎంఎస్ ఆఫీసులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ట్రైనింగ్ సెల్‌ను ప్రారంభిస్తున్న నాయకులు